శాంతిని కాపాడాలని శ్రీలంక నుంచి తమిళ నాడుకు స్విమ్మింగ్

స్విమ్మింగ్‌లో పాల్గొన్న విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌మోహన్‌రావు, ఆశ, రఘు తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 22: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ శాంతిని కాపాడాలని కోరుకుంటూ బర్కత్‌పురకు చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వినివిక్టోరియా ఆమె కుమారుడు స్టీఫెన్‌కుమార్ శ్రీలంక తలమన్నార్ నుంచి తమిళ నాడులోని రామేశ్వరం ధనుష్కోడి వరకు రిలే స్విమ్మింగ్ చేసి రికార్డు నెలకొల్పారు. తల్లి కుమారుడుతో పాటు మరో ముగ్గురు బెంగుళూరుకు చెందిన మోహన్‌రావు, ఆశ, రఘులతో కలిసి స్విమ్మింగ్ చేసి, భారతదేశ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆదివారం ఉదయం 5:30 నిమిషాలకు తలమన్నార్ నుంచి స్విమ్మింగ్ ప్రారంభించి 34.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశ్వరం ధనుష్కోడి వరకు 9 గంటల 35 నిమిషాల వ్యవధిలోనే తల్లి, కొడుకు స్విమ్మింగ్ చేసి రికార్డు నెలకొల్పారు. ఇండియన్ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు సతీశ్ మట్ట ఆధ్వర్యంలో ఈ రిలే స్విమ్మింగ్ నిర్వహించగా, అజయ్‌కుమార్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. సప్త సముద్రాలను ఈదడమే లక్ష్యం అని క్వినివిక్టోరియా మంగళవారం వెల్లడించారు.

ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలి

ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ

కాచిగూడ, ఏప్రిల్ 22: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల బకాయిలను చెల్లించి నిజాయితీ నిరూపించుకోవాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజ్ యాజమాన్యాలు లెక్చరర్స్ కు జీతాలు చెల్లించకపోవడంతో ఆరు యూనివర్సిటీలలో ఐదు యూనివర్సిటీలు పరీక్షలను బైకాట్ చేసినట్లు తెలిపారు. దీంతో విద్యార్థుల జీవితాలపై పెను ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు ఉన్నారు.

వరంగల్ సభకు జాతరలా కదలి రావాలి

సమావేశంలో మాట్లాడుతున్న కాలేరు రామకృష్ణ తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 22: కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాడని గోల్నాక డివిజన్ మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు భరత్ ముదిరాజ్ అన్నారు. గోల్నాక డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు కాలేరు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగకు బీఆర్ఎస్ శ్రేణులు స్వచ్ఛందంగా జాతరలా కదలి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రస్తుతం యావత్ తెలంగాణ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పరిపాలన పట్ల తెలంగాణ ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కేసి ధనార్జనధ్యేయంగా పాలన నడిపిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలకు రంగులు ..

ప్రపంచంలోనే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భీష్మాదేవ్ అన్నారు. ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు మంగళవారం కాచిగూడ డివిజన్ లోని బస్తీ, కాలనీలలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలకు రంగులు వేశారు. ఈ సందర్భంగా భీష్మ మాట్లాడుతూ ఎత్తిన నినాదాన్ని నిజం చేసి చూపిన అహింస మార్గ ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బబ్లుసింగ్ ఆంటో, తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ పార్టీ దిమ్మెకు రంగులు వేయిస్తున్న అధ్యక్షుడు భీష్మాదేవ్, బబ్లూసింగ్ తదితరులు

రైల్వే సంస్థకు లోకో పైలట్లే వెన్నెముక

సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే డీఆర్ఎం లోకేశ్‌విష్ణవ్

కాచిగూడ, ఏప్రిల్ 22: ప్రమాదాలు నివారించడం కేవలంలోకో పైలట్లకే సాధ్యమని, రైల్వే సంస్థకు లోకో పైలట్లే వెన్నెముకని హైదరాబాద్ డివిజన్ రైల్వే డీఆర్ఎం లోకేశ్ విష్ణవ్ అన్నారు. రైల్వే లోకో పైలట్ల కోసం కాచిగూడ రైల్వే స్టేషన్ పార్సల్ కార్యాలయం పక్కన ఏసీ గదులతో కూడిన 24 బెడ్లను మంగళవారం డీఆర్ఎం, రైల్వే అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకో పైలట్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. రైల్వే సంస్థ పురోగతి,మరింతగా లాభాల బాటలో పయణిచాలంటే లోకో పైలట్ల పాత్ర కీలకమైందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ డీఎంఈ కమల్ కాంట్, సీనియర్ డీఈఈ కిరణ్ కుమార్, సీనియర్ డీఓ ఎం విద్యాధర్, సీనియర్ డిసీఎం అనిరుద్ ఫార్మర్, సీనియర్ డీఈ ఎన్ కోఆపరేటివ్ ఆర్డినేషన్ దుర్గాప్రసాద్, డీఈ ఎన్ విష్ణు చౌదరి, డీఈ ఎన్ బి.రాము, సీనియర్ డీఎస్ టీఈ పావని, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, శైలేందర్ కుమార్ తో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలి

డీజీఎం విష్ణువర్ధన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న రవి

అంబర్‌పేట, ఏప్రిల్ 22 : తిలక్‌నగర్‌లో కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని తిలక్‌నగర్ బస్తీ సంఘ సేవకుడు బత్తుల రవి వాటర్‌వర్క్స్ అంబర్‌పేట సబ్ డివిజన్ డీజీ ఎం విష్ణువర్ధన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా బస్తీలో నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని, ఈ నీటి సరఫరా వల్ల బస్తీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

నిరంతర కృషికి గుర్తింపు ఉంటుంది

సంజయ్‌కిషోర్‌ను సత్కరిస్తున్న ఓలేటి పార్వతీశం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 22 నిరంతర కృషికి, ప్రతిభకు ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. సినీ పరిశోధకుడు రచయిత సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంజయ్ కిషోర్‌కు నగరంలోని ఓ హోటల్‌లో సత్కార సభ మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వోలేటి పార్వతీశం సంజయ్ కిషోర్‌ను సత్కరించి ప్రసంగించారు. ఎవరికీ పోటీ కాకుండా తనకంటూ ఒక మార్గం వేసుకుని రచయితగా సంస్థ నిర్వాహకుడిగా పాతికేళ్ల ప్రస్థానంలో ఎన్నో వైవిధ్య కార్యక్రమాలు నిర్వహించారని ప్రశంసించారు. అభినందన భవాని మాట్లాడుతూ సంజయ్ నలభై ఐదు ఏళ్ళు తన సాంస్కృతిక ప్రస్థానానికి గుర్తింపుగా చేసిన సత్కారం విశేష మైనదని కొనియాడారు. రచయిత్రి డాక్టర్ శోభా పెరిందేవి మాట్లాడుతూ సంజయ్ సేకరించిన ఫొటోలు సమాచారం పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్స్ ఉపయోగించుకుంటున్నారన్నారు.

పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ చేపట్టాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 22 : తెలుగు యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ జరిపించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డికి టీపీటీఎల్ఎఫ్ ప్రతినిధి బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లు అమ్ముకున్న విసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ (రెగ్యులర్) కోసం జనవరి 30న విడుదల చేసిన నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్ సైట్ లో పెట్టకుండా దొంగదారిన రిలీజ్ చేశారన్నారు. విద్యార్థులు ఎలాగోలా తెలుసుకుని అప్లై చేసుకుంటే కనీసం రిసీవుడ్ కాపీ కూడా ఇవ్వలేదన్నారు. పరీక్ష నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉందని, పీహెచ్‌డీ పరీక్షకు ఇవ్వాల్సిన ఓఎమ్ఆర్ షీట్ పాతది ఇచ్చారన్నారు. వంద మార్కుల ప్రశ్నాపత్రం కిగాను, ఓఎమ్ఆర్ షీట్లో బబుల్ చేసే గడులు యాభై మాత్రమే ఉన్న పేపర్లు ఇచ్చి విద్యార్థులను గందరగోళపరిచారన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ ప్రక్రియ అవకతవకల పై సత్వరమే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోని అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ని కోరారు. టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్ము విజయ్, కట్టా ప్రభాత్, చిట్టి బాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

విలియం షేక్స్పియర్ ఎక్సలెన్సీ అవార్డుకు సంగీత

అబిడ్స్ , ఏప్రిల్ 22: ఆంగ్ల భాష నిపుణురాలు, విద్యావేత్త, సాహితీవేత్త సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల కింగ్ కోఠి ఆంగ్లభాష విభాగం అధినేత హెచ్ ఓడీ డాక్టర్ సంగీత కు ఈ ఏడాది విలియం షేక్స్పియర్ ఎక్సలెన్సీ అవార్డు 20 25 ను ఎంపిక చేసినట్టు వికాస చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ కె రామ్ గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి ఒక్కరికి ఇచ్చే అవార్డు ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డును ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. నేడు కింగ్ కోటి లోని సెంట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రధానం చేస్తామని తెలిపారు.

నానల్‌నగర్ లో జలమండలి అధికారుల పర్యటన

ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా చేయడానికి అధికారులు కృషి చేయాలని నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని మెరాజ్ కాలనీలో జలమండలి జీఎం శ్రీనివాస్, డీజీఎం, మేనేజర్లతో కలిసి పర్యటించారు. సందర్భంగా స్థానికులు నీటి సమస్యలపై అధికారులకు వివరించారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 22

నాలుగున ఆరెకటిక సంఘానికి ఎన్నికలు

కోఠిలోని సంఘం కార్యాలయంలో ఎన్నికల తేదీని ప్రకటిస్తున్న తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ జమాల్పూర్ బాల్‌రాజ్, సంఘం సభ్యులు

జియాగూడ, ఏప్రిల్ 22 : కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ జమాల్పూర్ బాల్‌రాజ్ ఎన్నికల తేదీని ప్రకటించారు. మే 4వ తేదీన ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ నెల 23, 24 తేదీలలో నామినేషన్ల స్వీకరణ, 25న నామినేషన్ల ఉపసంహరణ, 26న స్క్రూట్రీని నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మే 4వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక ఎలక్షన్ కమిటీ కార్యదర్శి డాక్టర్ నిజాంకారి చంద్రశేఖర్, నాయకులు గెట్టికారి గోవిందు రాజ్ యాంకర్ ప్రేమ కుమార్ సంజయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

నేటి యువతరానికి విలువలను తెలియజేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కళారాధన కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డాన్స్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. అంతకముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, కూచిపూడి నృత్య గురువు, పసుమర్తి శేషుబాబు, తెలుగు వర్సిటీ ప్రొఫెసర్ వనజ ఉదయ్, అకాడమీ వ్యవస్థాపకురాలు జయంతి పాల్గొన్నారు.

– రవీంద్ర భారతి, ఏప్రిల్ 22

శిశువిహార్‌లో ఎస్సీపీసీ కమిషన్ పర్యటన

వంటగదిని పరిశీలిస్తున్న ఎస్సీపీసీఆర్ కమిషన్ బృందం

వెంగళరావునగర్, ఏప్రిల్ 22 : స్టేట్ హోం ఆవరణలోని శిశువిహార్‌లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం మంగళవారం పర్యటించింది. స్టేట్ హోం శిశు విహార్‌లో ఆశ్రయం పొందుతున్న పిల్లల గదులను తనిఖీ చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, సభ్యులు కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్ శిశువిహార్‌లో ఆకస్మికంగా పర్యటించి తనిఖీ చేశారు. పిల్లలు తినే డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ నిర్వహణ పరిశీలించారు. ప్రీ స్కూల్ లో పిల్లలతో సంభాషించారు. పిల్లల పట్ల శ్రద్ధ, ప్రేమ, ఆప్యాయత చూపే శిశువిహార్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు

కాచిగూడ, ఏప్రిల్ 22 : కాచిగూడ లింగంపల్లిలోని పారిశ్రామిక వేత్త ఇంట్లో వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చిన కేసును ఛేదించడానికి ఐదు పోలీసు బృందాలను రంగంలోకి దించినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ జోత్స్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాచిగూడ లింగంపల్లి అమ్మవారి దేవాలయం పక్కన ఉంటున్న హేమ్ రాజ్ దుగ్గల్, అతని భార్య మీనా దుగ్గల్ కు ఆదివారం రాత్రి ఇంట్లోని పని మనుషులు అన్నంలో మత్తుమందు ఇవ్వడంతో ఆ వృద్ధ దంపతులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని అన్నారు. ప్రస్తుతం ఆ వృద్ధ దంపతులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ క్షేమంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆ ఇంట్లో పని చేస్తున్న పనిమనుషులు దాదాపు రెండు కిలోల బంగారు ఆభరణాలు, రూ.3 కోట్లను దొంగిలించినట్లు సమాచారం. ఈ కేసును త్వరితగతిన ఛేదించడానికి ఐదు పోలీసు బృందాలు సీసీఎస్ టీం, టాస్క్ ఫోర్స్ టీం, కాచిగూడ డీఐ టీం, అప్జల్ గంజ్ డీఐ టీం, కాచిగూడ పీఎస్ టీంను ఏర్పాటు చేసి, నేపాల్ దొంగలను త్వరితగతిన పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెహిదీపట్నం, ఏప్రిల్ 22 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫ్ నగర్ సూరజ్ గార్డెన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలకు 871266 0410 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

గుడిమల్కాపూర్‌లో ఇంద్రారెడ్డికి ఘన నివాళి

మెహిదీపట్నం గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్లో మాజీ హోం మంత్రి ఇంద్రారెడ్డి 25 వ వర్ధంతి నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామ సురేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ అసోసియేషన్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, నాయకులు రంగారెడ్డి, ఏఎంసీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్‌రెడ్డి, కందాడ మధుసూదన్ రెడ్డి, కందివనం రవీందర్ గౌడ్, పాండు, కృష్ణ గౌడ్, లింగా రెడ్డి, జనార్ధన్ రెడ్డి, రైతులు వ్యాపారస్తులు పాల్గొని ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 22

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత

టీటీఐలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

బేగంపేట్, ఏప్రిల్ 22 : మైనర్ డ్రైవింగ్ చట్ట ప్రకారం నేరం.. మైనర్లు వాహనాలు నడిపితే అందుకు తల్లిదండ్రులు బాధ్యులవుతారని ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాలు– నివారణపై ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన ట్రాఫిక్ ఉల్లంఘన దారుల తల్లిదండ్రులకు రెండు రోజులుగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ వాహనదారుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. మైనర్ల డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రుల వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు సస్పెండ్ అయ్యే అవకాశం ఉందన్నారు. అన్ని విధాల వాహన డాక్యుమెంట్ ఉండాలని అర్హులైన వారే వాహనాలను ట్రాఫిక్ ఉల్లంఘనలు లేకుండా నడపాలని సూచించారు. ఈ కాక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, అశోక్, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

మే 23న బాల సాహిత్యోత్సవం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 22 : పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలోని శాంతా– వసంతా ట్రస్టు సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న కోడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్యోత్సవం ఈ సంవత్సరం మే 23న హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే. చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల సాహిత్యంలో నూతనత్వం ఆవశ్యకం, బాల సాహిత్యం–జనరంజక విజ్ఞాన రచనలు, పాఠశాలల్లో బాలసాహిత్యం– ఉపాధ్యాయులపాత్ర, బాల సాహిత్య వికాసం– రచయిత్రుల కృషి, బాలసాహిత్యం విస్తృతి మొదలైన అంశాల్లో సదస్సులు, అభిప్రాయ వేదికలు, విశిష్ట సేవలు అందించిన వారికి సత్కారాలు మొదలైన అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఔత్సాహిక ఉపాధ్యాయులు, బాలసాహిత్య రచయితలు వాట్సాప్ నంబరు 7603727234లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు దోమల బెడద లేకుండా చేయాలి

ప్రజలకు దోమల బెడద లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్ నగర్ డివిజన్‌లో దోమల బెడద నివారణ కోసం జీహెచ్ఎంసీ సర్కిల్ 13 ఎంటమాలజీ విభాగం అధికారులు నాలాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్తో రసాయనాల పిచికారీ పనులను చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ నానల్ నగర్ కార్పొరేటర్ ఎండి నసీరుద్దీన్ తో కలిసి ప్రారంభించారు. ప్రజలకు దోమల బెడద లేకుండా చేయాలని ఆయన సూచించారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 22

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఆసిఫ్ నగర్, రెడ్ హిల్స్ డివిజన్ల ప్రజలు ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను కలిసి మంచినీటి, రోడ్ల సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. – మెహిదీపట్నం, ఏప్రిల్ 22